ప్రజాశక్తి

శుక్రవారం 7 జూన్ 2024

5

పార్వతీపురం మన్యం

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10లోగా iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కాలేజీలో ఎలక్ట్రీషన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్, డ్రెస్ మేకింగ్ తదితరు కోర్సులు లభించినని తెలిపారు. మరిన్ని వివరాలకు 9441930405, 9491134464 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పడిలేచిన టిడిపి

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 1983 నుంచి టిడిపిదే హవా
- రెండు సార్లు క్లీన్‌స్వీప్
- కురుపాంలో తప్పని ఎదురీత

టిడిపి ఆవిర్భావం నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆ పార్టీదే హవా సాగింది. మధ్యలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నా.. ప్రస్తుత ఎన్నికల ఫలితాలు పడిలేచిన కెరటాలను తలపించాయి. గత 2019 ఎన్నికల్లో వైసిపి క్లీన్‌స్వీప్ చేసినప్పటికీ, అంతకు ముందు, ఆ తరువాత కూడా టిడిపి అదే రికార్డులను సృష్టించింది. 1994 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మొత్తం 12 స్థానాల్లోనూ టిడిపి ఎమ్మెల్యేలు గెలిచిన రికార్డు ఉంది. ప్రస్తుత ఎన్నికల్లోనూ అదే రకమైన ఫలితాలు వెలువడ్డాయి. 1983లో టిడిపి ఏర్పాటు నుంచి నేటి వరకు 10 సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. కురుపాం, బొబ్బిలి మినహా దాదాపు అన్ని ఎన్నికల్లోనూ టిడిపినే ఎక్కువ సీట్లు సాధించింది. ఇందులో అత్యధికంగా విజయనగరం, ఎస్.కోట నియోజకవర్గంలో ఎనిమిది సార్లు, నెల్లిమర్ల నియోజకవర్గంలో ఏడు సార్లు విజయఢంకా మోగించింది. ఈ క్రమంలో పూసపాటి అశోక్ గజపతిరాజు, పతివాడ నారాయణ స్వామి నాయుడు ఎక్కువ సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికై రికార్డులు సృష్టించారు. అదే స్థాయిలో మంత్రి పదవులను కూడా అలంకరించారు. నియోజకవర్గాల వారీగా ఒక్కసారి పరిశీలిస్తే..

\- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

పార్వతీపురంలోనూ ఏడోసారి గెలుపు

పార్వతీపురం నియోజకవర్గంలో 1997లో జరిగిన ఉప ఎన్నికతో కలుపుకుని మొత్తం 11 దఫాలుగా ఎన్నికలు జరిగాయి. దీంతో కలుపుకుంటే టిడిపి ఏడుసార్లు విజయం సాధించింది. 1983 నుంచి 1997 వరకు జరిగిన ఉప ఎన్నిక వరకు జరిగిన ఐదు ఎన్నికల్లో పసుపు జెండా రెపరెపలాండింది. ఆ తర్వాత 1999 నుంచి 2009 వరకు మరిశర్ల శివున్నాయుడు, శత్రుచర్ల విజయరామరాజు, సవరపు జయమణి వరుసగా కాంగ్రెస్ తరపున గెలిచారు. అనంతరం 2014లో వైసిపిపై టిడిపి తరపున బొబ్బిలి చిరంజీవులు గెలిచినప్పటికీ, 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమి చెవిచూసింది. తాజా ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి అలజంగి జోగారావుపై టిడిపి అభ్యర్థి విజయచంద్ర విజయం సాధించారు.

సాలూరులోనూ సవాలు విసిరిన టిడిపి

సాలూరు నియోజకవర్గంలోనూ టిడిపి సవాలు చేస్తూ వస్తోంది. ఇప్పటి వరకు టిడిపి 6సార్లు విజయం సాధించగా, ఒకసారి కాంగ్రెస్, మూడు సార్లు వైసిపి గెలుపొందాయి. 1983 నుంచి 2004 వరకు జరిగిన ఆరు సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క 1989లో జరిగిన ఎన్నికల్లో మాత్రమే కాంగ్రెస్ తరపున ఎల్ఎన్ సన్యాసిరాజు గెలిచారు. మిగిలిన ఐదు ఎన్నికల్లో తొలి రెండు సార్లు టిడిపి తరపున బోయిన రాజయ్య, మరో మూడు సార్లు ఆర్‌పి భంజ్‌దేవ్ విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ తరపున, 2014, 2019 ఎన్నికల్లో వైసిపి తరపున రాజన్నదొర వరుసగా విజయం సాధించారు. తాజాగా ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణిపై రాజన్నదొర ఓటమి చవిచూశారు.

కురుపాంలో ఎట్టకేలకు రెండోసారి

నేటి కురుపాం నియోజకవర్గం అంతకు ముందు నాగూరు కేంద్రంగా ఉండేది. పేరు ఏదైనా ఈ నియోజకవర్గంలో టిడిపికి తొలి నుంచీ గడ్డుపరిస్థితులే ఎదురయ్యాయి. 1983లో రాష్ట్రమంత్రా టిడిపి వైపు గాలివీచి, చివరకు జిల్లాలోని అన్ని చోట్లా పసుపు జెండా ఎగిరినప్పటికీ ఇక్కడ మాత్రం కాంగ్రెస్‌ను నిలువరించలేకపోయింది. 1994లో తొలిసారిగా టిడిపి తరపున నిమ్మక జయరాజ్ విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో ఇదే టిడిపిబోణీ. ఆ తర్వాత రెండు సార్లు కాంగ్రెస్, రెండు సార్లు వైసిపి విజయం సాధించాయి. మధ్యలో 2004 ఎన్నికల్లో సిపిఎం విజయం సాధించింది. తాజా ఎన్నికల్లో తోయక జగదీశ్వరి గెలుపు రెండోదని చెప్పకోవచ్చు.

చంద్రబాబుకు బొకేను అందజేస్తున్న విజయచంద్ర; లోకేష్‌కు బొకేను అందజేస్తున్న సంధ్యారాణి

చంద్రబాబును కలిసిన విజయచంద్ర

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును గురువారం అమరావతిలో కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తొలిసారిగా ఆయన చంద్రబాబును, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కలిసి అభినందనలు తెలిపారు.

లోకేష్‌ను కలిసిన సంధ్యారాణి

సాలూరు : జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను, గురువారం ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణి కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తొలిసారిగా ఆమె అమరావతిలో లోకేష్‌ను, టిడిపి అధినేత చంద్రబాబునాయుడునుకలిశారు. రెండు దశాబ్దాల తర్వాత నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిగా సంధ్యారాణి అఖండ విజయం సాధించారు. ఈనెల 12న చంద్రబాబు నాయుడు సిఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు దక్కనుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఎస్టీ కేటగిరీ నుంచి మన్యం జిల్లాలో సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీగా అనుభవం ఉన్న సంధ్యారాణి కి కేబినెట్‌లో చోటు దక్కవచ్చుననే చర్చ జరుగుతోంది. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

పెద్దగెడ్డను పరిశీలించిన జైకా బృందం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెద్దగెడ్డ రిజర్వాయర్ గురువారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జైకా బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌కు సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని జైకా కన్సల్టెన్సీ కో టీం లీడర్ సాప్ జాన్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు అలాగే స్పిల్‌వే ప్రధాన గేట్లు పరిశీలించి గేట్లు పనితీరును అడిగి తెలుసుకున్నారు. నీరు విడుదల సమయంలో గేట్లు ఎత్తివేతకు ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా మెకానిక్ ఇంజనీర్లతో చర్చించి సరి చేసుకోవాలని సూచించారు. అలాగే కాలువల పనులు నిలుపుదలపై అధికారులను ప్రశ్నించారు. గుత్తేదారులకు బకాయిలు నిలిపివేయడంతో పనులను నిలిపివేశారని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఇ వైవి రాజరాజేశ్వరి. ఇఇ ఆర్.అప్పలనాయుడు, డిఇలు కనకారావు, లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దగెడ్డను పరిశీలిస్తున్న జైకా అధికారులు

మన్యంలో మలేరియా?

ప్రతి ఏటా కేసులు నమోదు

మూడేళ్లుగా పంపిణీ కాని దోమ తెరలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వర్షకాలం వచ్చిందంటే చాలు ప్రతి ఏటా మన్యం జిల్లాలో మలేరియా కేసులు నమోదవుతూనే ఉన్నాయి. అక్కడక్కడ మరణాలు జరుగుతున్నాయి. జ్వరాలపై దృష్టిసారించాం. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి కేసులు నమోదు కాకుండా చూసుకుంటాం. ముందస్తు చర్యలు చేపట్టాం అంటూ అధికారులు ప్రకటనలు చేస్తున్నా పూర్తిస్థాయిలో నివారణా చర్యలు లేకపోవడంతో జ్వరాలు నమోదవుతూనే ఉన్నాయి. మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట, సాలూరు, పాచిపెంట, మక్కువ ఏజెన్సీ మండలాల్లో మలేరియా పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. మలేరియా దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తుగా వైద్య శాఖ అధికారులు ప్రతి ఏటా మే నెల నుంచి గ్రామాల్లో దోమల పిచికారి మందు చేపడుతున్నారు. అయితే వర్షాకాలంలో గ్రామాల్లో బోర్లు, వీధి కాలువలు, ఇంటి పరిసరాల ఆవరణంలో అపారిశుధ్య వాతావరణం ఎక్కువగా తాండవించడంతో దోమలు వ్యాప్తి అధికమై గిరిజనులు మలేరియా దోమ కాటుకు గురవుతున్నారు. మరోవైపు ప్రతి ఏటా ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు కూడా మలేరియా జ్వరంతో ఆసుపత్రిలో చేరడం పరిపాటిగా మారింది. ఆస్పత్రుల్లో రోగుల తాకిడి వల్ల మెరుగైన వైద్యమందక చాలామంది ప్రజలు ప్రైవేట్ క్లినిక్‌లో వైద్యం పొందుతున్న సందర్భాలు కూడా ఏజెన్సీలో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలకు దోమ తెరలు పంపిణీ చేస్తే దోమ కాటు నుంచి కొంతమేర రక్షణ పొందడానికి వీలుంటుంది. 2017, 2021లో ప్రజలకు దోమతెరలు పంపిణీ చేసిన అధికారులు మళ్లీ నేటి వరకు అందించలేదు.

2018 నుంచి మలేరియా కేసుల నమోదు :

ఉమ్మడి జిల్లా లో 2018 నుంచి మలేరియా పాజిటివ్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. 2018లో 415 మలేరియా కేసులు నమోదయ్యాయి. 2019లో 150, 2020లో 124, 2021లో 19 కేసులు నమోదైనట్లు అధికారుల గణంకాల్లో చూపించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైన తర్వాత 2022లో రికార్డు స్థాయిలో 502 మలేరియా కేసులు నమోదు కావడం విశేషం. 2023 జనవరిలో 38, ఫిబ్రవరి లో 34, మార్చిలో 28 కేసులు నమోదయ్యాయి. 2024లో గుమ్మలక్ష్మీపురం మలేరియా సబ్ యూనిట్ పరిధిలో 150 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు.

వసతిగృహంలో మలాథియన్ స్ప్రేయింగ్ చేయిస్తున్న అధికారులు

మలేరియా నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ప్రతి ఏటా వర్షాకాలంలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో ప్రబలే మలేరియాపై గిరిజనులకు అవగాహన కల్పించాలి. సీజనల్ వ్యాధుల నివారణకు వర్షాకాలం ప్రారంభానికి ముందే దోమల ఫాగింగ్, స్ప్రేయింగ్, దోమ తెరలు పంపిణీ చేపట్టాలి. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలి.

కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి.

43 గ్రామాల్లో స్ప్రేయింగ్ చేపడుతున్నాం

తాడికొండ, మొండిఖల్, నీలకంఠాపురం పిహెచ్‌సిల పరిధిలో గల 43 గిరిజన గ్రామాల్లో మలేరియా స్ప్రేయింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. మే నుంచి జూన్ 20 వరకు స్ప్రేయింగ్ చేపట్టి ప్రజలకు మలేరియా పట్ల అవగాహన కల్పిస్తున్నాం. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నాం.

జె. మోహన్ రావు,
మలేరియా అధికారి, గుమ్మలక్ష్మీపురం.

గ్రంథాలయాలపై బకాయిల గుదిబండ

గ్రంథాలయాల నిర్వహణ గాడి తప్పింది. విజ్ఞాన భాండాగారాలుగా చెప్పకునే గ్రంథాలయాలు నీరసించి పోతున్నాయి. సెస్ బకాయిలు రాక.. పక్కా భవనాలు లేక.. పాఠకులకు మౌలిక సౌకర్యాలు కల్పించలేక.. పుస్తకాలూ పూర్తిస్థాయిలో అందించలేక.. కునారిల్లుతున్నాయి. గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలన్న తలంపు ప్రభుత్వానికి కరువైంది. గ్రంథాలయాల నిర్వహణకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న స్థానిక సంస్థల సెస్సు వసూలు పూర్తిగా పడకేసింది.

జిల్లా కేంద్ర గ్రంథాలయం

- రూ.5 కోట్ల సెస్ బకాయి
- అత్యధికం మున్సిపాలిటీల నుంచే

ప్రజాశక్తి-విజయనగరంకోట

గ్రంథాలయం.. విజ్ఞాన భాండాగారం. ఇక్కడ చదువుకొని ఎంతోమంది యువత ఉద్యోగాలు సంపాదిస్తూ ఉంటారు. దిన, వార, మాస పత్రికలతోపాటు పోటీ పరీక్షల పుస్తకాలు, కథలు, ఇతిహాసాల పుస్తకాలను పిల్లల నుంచి యువత, పెద్దలు చదువుతూ విజ్ఞానాన్ని పెంచుకుంటూ ఉంటారు. అటువంటి విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాల అభివృద్ధికి ముఖ్యమైనది సెస్. ఉమ్మడి విజయనగరం జిల్లాలో గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం, మూడు గ్రామీణ, 37 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. వీటి నిర్వహణలో స్థానిక సంస్థల నుంచి వచ్చే సెస్సే కీలకం. గ్రంథాలయాల నిర్వహణకు స్థానిక సంస్థలు 8 శాతం సెస్సు అందివ్వాలి. గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నివాసం ఉంటున్న ఇళ్ల పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో ఈ 8 శాతం నిధులను జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాలి. జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణకు నెలకు లక్షల్లో వ్యయమయ్యే పరిస్థితి. కానీ ఆదాయం రావడం లేదు. ప్రభుత్వం సాయం అందించడం లేదు.

సిబ్బంది అరకొరే

జిల్లాలోని గ్రంథాలయాలు ఉద్యోగుల కొరతతో ఊగిసలాడుతున్నాయి. జిల్లాలో గ్రేడ్-1 లైబ్రరీగా విజయనగరం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉంది. గ్రేడ్-2లో పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి, శృంగవరపుకోట గ్రంథాలయాలు ఉన్నాయి. మిగతావి గ్రేడ్-3 గ్రంథాలయాలు. ఇందులో 30 గ్రంథాలయాలకు మాత్రమే ప్రభుత్వ కొలువులు ఉన్నాయి. మిగతా గ్రంథాలయాలకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఇందులో 14 పోస్టులు ఉన్నాయి. లైబ్రేరియన్-8, రికార్డు అసిస్టెంట్-1, హెల్పర్-5 పోస్టులు అవుట్ సోర్సింగ్‌లో నడుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా నెల్లిమర్ల, కురుపాం, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, మక్కువ, భోగాపురం, చీపురుపల్లి, పాచిపెంట, రామభద్రపురం గ్రంథాలయాల్లో పోస్టులు ఖాళీలున్నాయి. 41 గ్రంథాలయాలకు గాను 26 చోట్ల మాత్రమే సొంత భవనాలున్నాయి. 8 అద్దె భవనాలు, 7 అద్దె ఉచిత భవనాలు ఉన్నాయి.

ఏళ్ల తరబడి బకాయి

గ్రంథాలయ నిర్వహణకు సంబంధించి స్థానిక సంస్థల నుంచి సెస్ బకాయిలే వసూలు కావడం లేదు. జిల్లాలో సుమారు రూ.5 కోట్ల సెస్ బకాయి ఉండటమే అందుకు నిదర్శనం. ఉమ్మడి విజయనగరం జిల్లాలో మేజర్, మైనర్ పంచాయతీల నుంచి రూ1.50 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. బొబ్బిలి మున్సిపాలిటీ నుంచి ఎప్పటికప్పుడు సెస్ చెల్లిస్తూ వస్తున్నారు. సాలూరు మున్సిపాలిటీ నుంచి రూ.40 లక్షలు, పార్వతీపురం నుంచి రూ.16 లక్షలు, నెల్లిమర్ల నుంచి రూ.26 లక్షలు రావాల్సి ఉంది. అత్యధికంగా విజయనగరం కార్పొరేషన్ నుంచి రూ.3 కోట్ల బకాయిలు ఉండగా, పలుమార్లు గ్రంథాలయ అధికారులు మున్సిపల్ కార్పొరేషన్‌కు, స్థానిక నాయకులకు వినతులు అందజేశారు. ఎన్నికలు కోడ్ దగ్గర్లో ఉండగా, కార్పొరేషన్ నుంచి రూ.50 లక్షలు మాత్రమే అందజేశారు. ఇంకా రూ.2.50 కోట్ల మేర కార్పొరేషన్ నుంచి బకాయి ఉంది. ఈ బకాయిలు రాక గ్రంథాలయాలు అభివృద్ధికి నోచుకోలేదు. గ్రంథాలయ ఉద్యోగుల జీతభత్యాలకు రాష్ట్ర ప్రభుత్వం కొంత చెల్లించినా, మరికొంత డబ్బులు సంస్తే కలుపుకొని వేతనాలు అందిస్తోంది.

జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలు సెస్ లేక అభివృద్ధికి ఆమడ దూరంలో కొనసాగుతున్నాయి. కనీస సౌకర్యాలైన కూర్చునేందుకు కుర్చీలు, టేబుళ్లు కొన్ని గ్రంథాలయాల్లో లేవంటే ఏ విధంగా కొనసాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

సెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

గ్రంథాలయాలు అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా సెస్సే ఆధారం. మౌలిక సదుపాయాలు కల్పించాలన్నా, పుస్తకాలు ఏర్పాటు చేయాలన్నా స్థానిక సంస్థల నుంచి వచ్చే ఆదాయమే కీలకం. జిల్లాలో సుమారు ఐదు కోట్ల రూపాయలు సెస్ రావాల్సి ఉంది. దీంతో భవన నిర్మాణాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం సంవత్సరానికి కొంత మొత్తం జీతాలు కింద ఇస్తే దానికి సెస్ జోడించుకుని వేతనాలు చెల్లిస్తున్నాం. సాధారణ పుస్తకాలను ప్రతి సంవత్సరం బడ్జెట్ పెడితే ప్రభుత్వమే ఇస్తుంది. జిల్లాలో ఖాళీలున్న గ్రంథాలయాల్లో ఉద్యోగులను ప్రభుత్వం నియమించాల్సి ఉంది.

\- బి.లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పేరు మారుస్తున్న టిడిపి కార్యకర్తలు

సర్వజన ఆస్పత్రి బోర్డు మార్పు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బోర్డును గురువారం సాయంత్రం టిడిపి నాయకులు మార్చారు. మహారాజా ప్రభుత్వ ఆస్పత్రిగా కొత్త బోర్డు తగిలించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు ఆధ్వర్యాన ఆ పార్టీ కార్యకర్తలు భారీగా ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బోర్డును తొలగించి, కొత్తది బోర్డు ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ ఎస్ఐలు నవీన్ పడాల్, నరేష్.. సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా పేరు మార్చడం సరికాదని ఎస్ఐలు చెప్పగా, ప్రజల కోరిక మేరకు మార్చామని టిడిపి నాయకులు బదులిచ్చారు. మహారాజా జిల్లా కేంద్ర ఆస్పత్రిగా ఉన్న పేరును గత ప్రభుత్వం 2022 అక్టోబరు ఆరో తేదిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మార్చిన విషయం విదితమే.

ప్రజా తీర్పును గౌరవించాలి : బొత్స

ప్రజాశక్తి-గరివిడి

ప్రజా తీర్పును అందరూ గౌరవించాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రతిఒక్కరూ మానవత్వ దృక్పథం కలిగి ఉండాలని, పేదలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని చెప్పారు. రెచ్చగొడితే రెచ్చిపోవద్దని, రాత్రి, పగలు రెండూ వస్తాయని వ్యాఖ్యానించారు. గరివిడిలో వైసిపి కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలపై ఎవరూ దిగులు చెందొద్దని, ఎన్నికల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. ఐదేళ్లపాటు చేసినంతవరకు అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రాన్ని సంక్షేమ, అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. పేదవాడు తలెత్తుకొనేలా కృషి చేశామని వివరించారు. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని కోరుకున్నారని, ప్రజా తీర్పును గౌరవిద్దామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి నష్టం కలగకుండా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించే దిశగా అధికారంలోకి వచ్చే ప్రభుత్వం పనిచేస్తుందని ఆకాంక్షించారు. ప్రతిపక్షంలో ఉన్నా సరే పేదలకు అండగా నిలుస్తామన్నారు. తన ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, ఏ సమస్య వచ్చినా సరే తనకు ఒక ఫోన్ కాల్ చేస్తే చాలని భరోసానిచ్చారు.

ప్రజల అభిమానమే గెలిపించింది

ప్రజాశక్తి - కురుపాం

ప్రజా అభిమానమే కురుపాం నియోజకవర్గంలో మూడు దశాబ్దాల తర్వాత టిడిపి ఎమ్మెల్యే టి.జగదీశ్వరి విజయానికి నాంది అయిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్ర దేవ్ అన్నారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మంగళవారం వచ్చిన ఎన్నికల ఫలితాలు ఎంతో ఆనందాన్నిచ్చాయన్నారు. 23,500 ఓట్ల మెజార్టీ కురుపాం నియోజకవర్గ ప్రజలు ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో అనేక ప్రజా సమస్యలున్నాయని, వాటిని రానున్న ఐదేళ్లలో పరిష్కారానికి తన వంతు కృషి చేసి పరిష్కరిస్తామని అన్నారు. అందుకు ప్రజలు, అధికారులు, నాయకులు సహకారం కూడా కావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టిడిపికి భారీ ఆధిక్యతను ఇచ్చిన ప్రజల ఆకాంక్షను వమ్ము చేయకుండా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో పయనించేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తూ నియోజకవర్గంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇంతటి విజయాన్ని అందించిన కురుపాం నియోజకవర్గ ఎప్పటికీ కతజ్ఞతుడై ఉంటానని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరేష్ చంద్రదేవ్

ఎమ్మెల్యేకు ఎపిజిఎల్ఎ జిల్లా కార్యదర్శి అభినందనలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

కొత్తగా ఎన్నికైన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మరడ సింహాచలం గురువారం ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని గ్రామ రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు నియోజకవర్గంలోని రైతులకు, ప్రజలు ఏం కోరుకుంటున్నారో ఆయా అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆమెను కోరారు.

ఎమ్మెల్యేకు బొకెను అందజేస్తున్న సింహాచలం

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రంలోని పలు వీధుల్లో రక్షిత నీరు సక్రమంగా సరఫరా లేదని, కాలువలు పరిశుభ్రం లేక ప్రజలు వ్యాధుల బారిన పడే ఆస్కారం ఉందని ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ దేవకుమార్‌ను టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు గురువారం కోరారు. ఇప్పటికే పలు వీధుల్లో ఒకరిద్దరు చొప్పున జ్వరాలు, విరోచనాలతో బాధపడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులను అప్రమత్తం చేశారు. అలాగే వాటర్ ట్యాంక్‌లో క్లోరినేషన్‌కు ఆదేశించారు. ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లేశ్వరరావు

కూటమి పాలనలో అభివృద్ధి : జనసేన

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి రావడంతో రాష్ట్రంలో అభివృద్ధి పథంలో పయనించనుందని జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె.మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని మొండెంఖల్‌లో నియోజకవర్గ ఎమ్మెల్యేగా జగదీశ్వరీ గెలుపు కూటమి సునామీ సృష్టించడంతో ఉమ్మడి పార్టీ శ్రేణులు గురువారం కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరాచకపాలనతో ప్రజలు విసిగి చెంది కూటమికి సంపూర్ణ మద్దతుతో గెలిపించి కనీసం జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా కూడా కల్పించకుండా భారీగా కూటమి ఎమ్మెల్యేలను గెలిపించడంతో ఇక ప్రజలకు స్వర్ణయుగం పరిపాలన తెచ్చుకున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు నేరెడిబిల్లి వంశీ, రంజిత్ కుమార్ నాయక్, నరేష్, భగవాన్, జీవన్, సుక్కు, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలను పరిశీలిస్తున్న డిడి అన్నదొర

గురుకులంలో ప్రవేశాలకు లాటరీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కారిగూడ మినీ గురుకులంలో ప్రవేశాలకు గురువారం స్థానిక గురుకుల బాలుర కళాశాలలో డిడి ఎం.అన్న దొర ఆధ్వర్యంలో ప్రవేశాలు కల్పించారు. 2,5,6,7 తరగతులు ఈ విద్యాసంస్థల్లో ప్రవేశాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు, ప్రిన్సిపల్ కన్వీనర్ అజిత్ కుమార్, ప్రిన్సిపాళ్లు చంద్రకళ, హేమలత, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

ముగిసిన అఖండసాయి నామ సప్తాహం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో మే30న ప్రారంభమైన 22 వ వార్షికోత్సవం, 18వ అఖండ సాయి నామసప్తాహం గురువారంతో ముగిసింది. అఖండ సాయినామ సప్తాహం ముగింపు సందర్భంగా ఉదయం కాకడ హారతి, సుప్రభాతసేవ, తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామివారి విగ్రహానికి క్షీరాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి, పెద్దూరు, పార్వతీపురం, విశాఖపట్నం, విజయనగరం, తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. అలాగే మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమంలో గరుగుబిల్లి, హిక్కింవలస ,పెద్దూరు, రావుపల్లి, గొట్టివలస, తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. వార్షికోత్సవం సందర్భంగా వారం రోజులు పాటు ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్యులు, అంగన్వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, ఎనీమియా సంబంధిత ఆరోగ్యం లోపం ఉన్న వారి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ మంచి వైద్య సేవలందించాలని సూచించారు. తప్పనిసరిగా వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో సందర్శించి గ్రామంలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల ఆరోగ్య స్థితి గతులను పరిశీలించి నివేదికలు అందజేయాలని తెలిపారు. ముఖ్యంగా అంగన్వాడీ పరిధిలో గల గర్భిణులు, బాలింతల వివరాలను ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చి వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మండలంలోని ఎట్టి పరిస్థితుల్లో గర్భిణులు, బాలింతులు, చిన్నపిల్లలు రక్తహీనత లోపంతో మృతి చెందే అవకాశం లేకుండా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. కాబట్టి గ్రామాల్లో ఎప్పటికప్పుడు వైద్య, అంగన్వాడీ సిబ్బంది గర్భిణీ, బాలింతల వివరాలు పూర్తిస్థాయిలో వారు ఆరోగ్య పరిస్థితిపై పరిశీలిస్తూ పలు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ఆహారాన్ని గర్భిణీ, బాలింతలు పూర్తిస్థాయిలో వినియోగించుకొనేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ కొమరాడ ప్రాజెక్టు పిఒ సుగుణ, కొమరాడ పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ అరుణ్ కుమార్, శిరీష, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: జిల్లాలో శిశు మరణాల రేటు తగ్గింపుపై సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం హెచ్ ఓ డాక్టర్ శివకుమార్ సూచించారు. గురువారం పట్టణం లో గుమడాం వైటిసిలో మామిడిపల్లి పిహెచ్‌సి, మెంటాడవీధి, తెలగావీధి యుపిహెచ్‌సిలకు చెందిన ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం నుంచి జిల్లాలో కేంద్ర వైద్యబృందం పర్యటించనున్న నేపథ్యంలో సిబ్బంది శిశు మరణాలకు సంబంధించిన వివరాలు, ప్రిజం 10లో భాగం చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు,నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాల్ వున్నారు.

సాలూరు : వైద్య, అంగన్‌వాడీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ

పాచిపెంట : మండలంలో గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత, శిశు మరణాలు తగ్గించేందుకు కలిసికట్టుగా చర్యలు చేపట్టేందుకు ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, సచివాలయ సిబ్బందితో ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ సమీక్షించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రిజం-10 కార్యక్రమంలో భాగంగా మండలంలో గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత, శిశు మరణాలు పదికి తగ్గించేందుకు పిల్లల్లో పౌష్టికాహార లోపం నివారణకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ఈనెల 8న కేంద్ర బృందం మండలానికి వస్తుందని తెలిపారు. సమావేశంలో ఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంతలక్ష్మి, వైద్యాధికారులు వెంకటరమణ, సురేష్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబలో 104 వైద్య శిబిరం డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వంచారు. గర్భిణీల్లో రక్త హీనత, హైరిస్క్ ఉన్న వారు తనిఖీ చేయడం, అలాగే అన్ని రక్త పరీక్షలు చేసి గర్భిణులకు అందజేస్తున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన మందులు ఇస్తూ వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిహెచ్‌సిలో సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. రక్త హీనత, హైరిస్క్ సమస్యలకు గర్భిణీలు గురికాకుండా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. అదే విధంగా ఈ శిబిరానికి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. 60 ఏళ్ల పైబడిన వారు ఈ వైద్య సేవలు వినియోగించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఉదయకుమారి, మౌనిక, ఈశ్వరి, రమేష్. 104 సిబ్బంది దుర్గాప్రసాద్, శంకరావు, ఆశాలు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ : డిఎంఒ

ప్రజాశక్తి - సీతానగరం

ఆరోగ్య కార్యక్రమాల సమగ్ర నివేదికలను ఎప్పటికప్పుడు పునః పరిశీలన చేసుకొని ప్రజలకు ఆరోగ్యపరంగా సమస్యలు తలెత్తకుండా తగు కార్యాచరణ చేయాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి. జగన్ మోహనరావు స్పష్టం చేశారు. స్థానిక పిహెచ్‌సిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగుల ఆరోగ్య సమస్యలు అందజేస్తున్న చికిత్స రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకొని స్పష్టమైన రోగ నిర్ధారణ చేయాలని సూచించారు. దీర్ఘ కాలిక రోగులకు క్షేత్రస్థాయి పర్యవేక్షణ జరిగేలా చూడాలన్నారు. జ్వర నిర్ధారణ పరీక్షలు సకాలంలో జరపాలన్నారు. ల్యాబ్ రికార్డులు తనిఖీ చేసి రోజు వారీ చేపడుతున్న జ్వర పరీక్షల వివరాలు పరిశీలించారు. అనంతరం అత్యవసర చికిత్స అవసరమైన మందులు, వైద్య పరికరాలు పరిశీలించారు. ప్రధాని రహదారికి సమీపాన ఉన్న ఆసుపత్రి కావున ప్రాథమిక చికిత్స సిద్ధంగా ఉంచాలన్నారు. కుక్క,, పాము కాటుల చికిత్సకు అవసరమైన ఎఆర్‌ఒ, ఎఎస్‌వి మందుల లభ్యతను పరిశీలించారు. జాప్యం చేయక చికిత్సను వెంటనే అందజేయాలన్నారు. గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య పర్యవేక్షణకు సంబంచి ప్రిజమ్10 ప్రోగ్రాం పక్కగా నిర్వహించాలన్నారు. షిఫ్ట్ డ్యూటీ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ పావని,సిహెచ్‌ఒ ఎస్వీ రమణ, సూపర్వైజర్స్ సత్యవతి,భవాని,శర్మ ,వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : ఎమ్మెల్యే జయకృష్ణను అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు; మక్కువలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ప్రసాదరావునాయుడు

కొనసాగుతున్న టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం ఎమ్మెల్యేగా బోనెల విజయచంద్ర అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో టిడిపి అభిమానులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ గెలుపు సంబరాలు జరుపుకుంటున్నారు. మండలంలోని నర్సిపురంలో మాజీ వైస్ ఎంపిపి గొట్టాపు గౌరీ, వెంకటరమణ, ఎంపిటిసి యాగిరెడ్డి తవిటి నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో పలుచోట్ల గురువారం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అలాగే సూడిగాంలో మండల టిడిపి అధ్యక్షులు గొరజాన చంద్రమౌళి ఆధ్వర్యంలో స్థానిక షిరిడి సాయి మందిరంలో అన్నదానం నిర్వహించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో యువకులు ఎక్కడికక్కడ గెలుపు వేడుకలను నిర్వహిస్తున్నారు.

గుమ్మలక్ష్మీపురం: గత రెండు రోజులుగా నూతన ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కి అభినందనలు తెలపడానికి వస్తున్న నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, స్నేహితులు, అభిమానులు నివాస ప్రాంతమంతా కోలాహలం నెలకొంది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, గరుగబిల్లి, జియమ్మవలస, కొమరాడ మండలాల నుంచి వేలాది సంఖ్యలో ప్రజల వస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మన్య ప్రాంతంలో తొలిసారి ఎమ్మెల్యే గెలుపొందడంతో అన్ని రకాలుగా వెనుకబడి ఉన్న ఏజెన్సీ అభివృద్ధికి చిరునామాగా మారుతుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

మక్కువ : స్థానిక మేజర్ పంచాయతీలో టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు. సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావునాయుడును వీధివీధికి పిలుచుకొని టిడిపి కార్యకర్తలు, సన్మానాలు చేపట్టారు. గురువారం కూరాకుల వీధి, ఎస్సీ వీధి, రెల్లి వీధుల్లో కేకులను కట్ చేశారు. మక్కువ మేజర్ పంచాయతీని ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణి సహాయ సహకారాలతో ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధికి పాటుపడాలని టిడిపి శ్రేణులు కోరుతున్నారు.

వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే గెలుపొందిన నిమ్మక జయకృష్ణకు అభినందనలు తెలిపేందుకు నియోజకవర్గం నుంచిపెద్ద ఎత్తున అభిమానులు పోటెత్తారు. మండలంలోని ఎం.రాజపురంలో గల ఆయన నివాసానికి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వచ్చి జయకృష్ణకు పుచ్ఛగుచ్ఛాలిచ్చి అభినందనించారు. అలాగే శాలువా కప్పి సన్మానించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు ఉయ్ లవ్ రీడింగ్‌లో భాగంగా క్విజ్ పోటీలు నిర్వహించారు. అలాగే శ్రీకృష్ణదేవరాయులు జీవిత చరిత్రను విద్యార్థులకు చదివి వినిపించారు. క్రీడాపోటీల్లో భాగంగా చదరంగం, క్యారంబోర్డు తదితర ఆటల పోటీలు నిర్వహించామని శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. అలాగే ప్రతిరోజూ వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

కేరమ్స్, చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సిబ్బంది లేకపోవడంతో బోసిపోయిన ఆర్తాం గ్రామ సచివాలయం

సచివాలయ సిబ్బంది పనితీరు మారేనా?

- మధ్యాహ్నం 12 గంటలకే ఖాళీగా దర్శనమిస్తున్న కార్యాలయం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను ఆ ఉద్యోగులు సమయ పాలన పాటించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రధానకారణం అధికారుల పర్యవేక్షణ లేకపోవడమేనన్న చర్చ జరుగుతుంది. ఇందుకు నిదర్శనం ఆర్నాడ సచివాలయ సిబ్బంది పనితీరే.

మండలంలోని అర్నాడ సచివాలయ ఉద్యోగులు సమయానికి హాజరుకావడంలేదని, ఒకవేళ వచ్చినా కార్యాలయంలో ఉండడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి సిబ్బంది విధులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సచివాలయంలో 8 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎం.సత్యన్నారాయణ టికె జమ్ము సచివాలయానికి రెగ్యులర్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆయన గురువారం టికె జమ్ము సచివాలయం పరిధిలో ప్రిజం-10 అధికారులతో సమావేశంలో పాల్గొన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం.శైలజ, మహిళా పోలీస్ చంద్రకళ మాత్రమే సచివాలయంలో గురువారం అందుబాటులో ఉన్నారు. సర్వేయర్ మరిశర్ల నవీన్, వెటర్నరీ అసిస్టెంట్ మండంగి కామేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎం.విజయకుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్లు ఉదయం 12 గంటలైనా విధులకు హాజరు కాలేదని ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎం.సత్యనారాయణకు విలేకరి ఫోన్‌లో వివరణ కోరగా సిబ్బంది ఫీల్డ్‌లోకి వెళ్తే కార్యాలయంలో మూమెంట్ రిజిష్టర్‌లో సంతకం చేసి ఉండాలన్నారు. అందుకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాలపై పర్యవేక్షణను వారంలో ఒక్కసారైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక వార్షికోత్సవం

ప్రజాశక్తి- బొబ్బిలి

తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక మూడవ వార్షికోత్సవ వేడుకలను జాతీయ అధ్యక్షులు డాక్టర్ పి.ఆర్ఎస్ఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో బొబ్బిలి పట్టణంలో స్థానిక సాహితీ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల కాలంలో ఎంతో నిష్ణాతులైన కవులను ఒకే తాటిపై తీసుకువచ్చి వివిధ కవితలతో పాటు చర్చ గోస్టులు నిర్వహించామన్నారు. ఇప్పటికే 157 జూమ్ సమావేశాలను నిర్వహించామన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యులు పుల్లెల శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాష ఈ నాటికీ నిత్య నూతనంగా వెలుగుతుందని కొనియాడారు. ఈ సంస్థ స్థాపించినప్పటి నుండి సాహిత్యం పరంగా కిలపర్తి దాలినాయుడు మాస్టారు, మీసాల చిన్న గౌరి నాయుడు, డాక్టర్ బి రమాదేవి, డాక్టర్ నవనీత రవీందర్, మోటూరి నారాయణరావు సంస్థకు సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ట్రెజరర్, జన దీపిక బొబ్బిలి నియోజకవర్గ విలేకరి కురమాన రామకృష్ణ, పక్కి రమేష్ కుమార్, పట్నాయకుని వేణుగోపాలరావు, అల్లు అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు వ్యయం... ఫలితం శూన్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా జామివారి కాంప్లెక్స్ సమీపంలో ఒట్టిగెడ్డ వద్ద ఇటీవల పంచాయతీ నిధులు రూ.లక్షా20వేలతో బోరుబావి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నప్పటికీ పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో సరిపడడంతో లేదు. దీంతో ఈ బోరుబావి నీరు కూడ రక్షిత పథకానికి ఎక్కించి వాటి ద్వారా ప్రజలకు తాగునీరందించాలనే అధికారుల వ్యూహం బెడిసి కొట్టింది. ఈ బోరు బావి ద్వారా అనుకున్న స్థాయిలో తాగునీరు సరఫరా చేయడం సాధ్యం కాదని అప్పట్లో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తేల్చేశారు. లక్షలాది రూపాయలతో వెచ్చించి బోర్ బావి తవ్వకాలు జరిపినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం ఇది నిరుపయోగంగా ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తుంది. అదే విధంగా 2014లో కస్పావీధి గెడ్డ కాలనీలో రక్షిత మంచినీటి పథకం నుండి సక్రమంగా తాగునీరందడంలేదని కాలనీ వాసులు అప్పటి సర్పంచ్ జామి అనురాధకు ఫిర్యాదు చేశారు.

నిరుయోగపయోగంగా బోరుబావి

నిరుపయోగంగా ఉన్న బోరు

ఈ మేరకు పరిశీలన జరిపి మేజర్ పంచాయతీ నిధుల నుంచి రూ.2 లక్షల అంచనాతో బోరుబావి తవ్వి మోటర్ బిగించి కొళాయి పాయింట్లు కూడా ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వచ్చే నీరు తాగేందుకు పనికి రావడంలేదని, ఇతరాత్ర అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నామని,గొంతు తడుపు కునేందుకు ఎగువ ప్రాంతానికి వచ్చి నీరు పట్టుకొని దాహార్తిని తీర్చుకుంటున్నామని కాలనీ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మేజర్ పంచాయతీ అధికారి స్పందించి శివారు ప్రాంత ప్రజలకు తాగు నీరుందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక మేజర్ పంచాయతీ ఇన్‌ఛార్జి ఇఒ పి.రాము వద్ద 'ప్రజాశక్తి' వివరణ కోరగా, తాగునీటి సమస్య వాస్తవమేనని, పరిశీలన జరిపి తాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బేబినాయన దృష్టి పెట్టాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు కోరారు. కోటలో గురువారం బేబినా యనను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పట్టణంలో రోడ్ల విస్తరణ పూర్తి చేయాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, తాగునీరు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని బేబినాయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బేబినాయనకు అభినందనలు వెల్లువ

టిడిపి ఎమ్మెల్యే బేబినాయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కోటలో గురువారం బేబినాయనను కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు. బేబినాయనను బ్రహ్మకుమారీలు కలిసి సత్కరించారు. కోట రెండో రోజు అభిమానులు, కార్యకర్తలతో కిటకిటలాడింది.

రామభద్రపురం: అ ప్రజాసేవే పరమావధిగా అనేక సేవా కార్యక్రమాలు చేసి నేడు అఖండ మెజారిటీ సాధించిన బేబీ నాయన బొబ్బిలి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం ప్రజా విజయంగా భావిస్తున్నామని ప్రపంచ ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పల ఈశ్వరరావు అన్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని వెంకంపేట పంచాయితీ వైకెఎం నగర్ కాలనీలో నివాసముంటున్న పల్లా సింహాచలం (36) గురువారం ఉదయం ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం బల్ల కృష్ణాపురం గ్రామానికి చెందిన పల్లా సింహాచలం పార్వతీపురం పట్టణంలో ఓ ఫర్నీచర్ షాపుల్లో పనిచేస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులతో బాధపడుతున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరివేసుకొని మృతి చెందిన సింహాచలం

భార్య మృతి కేసులో భర్త అరెస్ట్

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక దళిత కాలనీకి చెందిన తుట్ట మాధురి మృతికి ఆమె భర్త కృష్ణ పెట్టిన ఇబ్బందులే కారణమని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పి.నరసింహమూర్తి తెలిపారు. గత నెల 22న మాధురి ఇంటిలోనే టర్పెంటైల్ట్ వంటిపై పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అనంతరం కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఈనెల 1న మృతి చెందింది. మాధురి మృతికి భర్త పెట్టిన ఇబ్బందులే కారణమని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.